ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం, 12 జూలై 2024 www.prajaaswaram.com 2PM



# శాకంబరీ దేవిగా ఉజ్జయిని మహంకాళి

సికింద్రాబాద్, జూలై 12 (ప్రజాస్వరం): సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రకాలైన కూరగాయలతో ఆలయంతో పాటు గర్భగుడిని కూడా అలంకరణ చేసారు. ఆలయాన్ని నాలుగు వేల కిలోల వివిధ రకాల కూరగాయలతో ఆలయంలో అలంకరించారు. ఆషాఢ బోనాల జాతరలో భాగంగా అమ్మవారి ఘటోత్సవం కన్నుల పండువగా కొనసాగుతున్నది. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్టు ఈవో వెల్లడించారు.



## కేజ్రీవాల్‌కు బెయిల్

### ..అయినా విడుదల కష్టమే

న్యూఢిల్లీ, జూలై 12 (ప్రజాస్వరం) : ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీలాండరింగ్ కేసులో బెయిల్సీబీఐ కేసులో విచారణ ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఈడీ కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ ను విచారించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం.. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. కేజ్రీవాల్ ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి అని గుర్తుచేసింది. ఈ కేసుకు సంబంధించి ఆయన 90 రోజులకు పైగా విచారణ ఎదుర్కొన్నారని చెబుతూ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. లిక్కర్ పాలసీలో మనీలాండరింగ్ ఆరోపణలతో కేజ్రీవాల్ ను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రస్తుతం బెయిల్ ఇచ్చింది. అయితే, కేజ్రీవాల్ పై ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కూడా ఎఫ్ఐఆర్ ఫైల్ చేసింది. ఈ కేసులో ఆయన విచారణ ఎదుర్కొంటున్నారు. ఆ కేసులో బేయిల్ రాకపోవడంతో కేజ్రీవాల్ విడుదలయ్యే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు.

# నేడొకరు.. రేపు మరొకరు!



- కాంగ్రెస్ లోకి బీఆర్ ఎమ్మెల్యేల క్యూ
- నేడు చేరనున్న ప్రకాశ్ గౌడ్
- రేపు అరికెపూడి గాంధీ చేరే అవకాశం
- మరో ఐదుగురు ఎమ్మెల్యేలతో చర్చలు
- అసెంబ్లీ సమావేశాలకు ముందే చేరికలు పూర్తయ్యే అవకాశం
- బీఆర్ఎస్ కు కంటిమీద కునుకు కరువు



హైదరాబాద్, జూలై 12 (ప్రజాస్వరం): పదేళ్ల అధికార యోగం అనంతరం ప్రతిపక్షంలో కూర్చున్న భారత రాష్ట్ర సమితికి ఫిరాయింపుల భయం పట్టుకుంది. ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేజారిపోతున్నారు. గత ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. త్వరలో బీఆర్ఎస్ లెజిస్లేటివ్ పార్టీని విలీనం చేసుకుంటామంటూ కాంగ్రెస్ సవాల్ చేస్తోంది. తాజాగా బీఆర్ఎస్ కి మరో భారీ షాక్ తగలబోతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరడం ఖాయమైనట్టు తెలుస్తున్నది. ఇప్పటికే ఆయన రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. మరోవైపు, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా రేపు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరబోతున్నారని చెప్పుకుంటున్నారు. వీరితో పాటు మరో ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ నేతల చర్చలు సఫలమయినట్టు తెలుస్తోంది. వీరంతా కాంగ్రెస్ లో చేరడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈలోగానే చేరికలను పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది.

### గులాబీ నేతల్లో మౌనం..

ఓవైపు పార్టీ అధినేత కేసీఆర్ చుట్టూ కేసుల ఉచ్చు బిగిసుకుంటోంది. ఎమ్మెల్సీ కవిత ఇంకా బెయిల్ రాక జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి. రానున్న రోజులు మరింత పార్టీకి గడ్డుకాలంగా కనిపిస్తుందని పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి.ఇన్ని పరిణామాల మధ్య పార్టీ కీలక నేతలు కేటీ రామారావు, హరీష్ రావు వారం రోజుల పాటు ఢిల్లీలోనే మకాం వేశారు. కవిత మెయిల్ కోసం న్యాయవాదులతో చర్చలు అంటూ బయటకు చెప్తున్నా, అసలు కారణం వేరే ఉందని పార్టీలో తీవ్రంగా చర్చ జరుగుతుంది. బీజేపీతో పొత్తు వైపుగా బీఆర్ఎస్ వెళుతుందని మరో వైపు బయట ప్రచారం జరుగుతుంది. అసలు ఢిల్లీలో ఆ ఇద్దరు నేతలు ఎవరిని కలిశారు ఎవరితో సంప్రదింపులు జరిపారు అన్నదీ సస్పెన్స్ గానే మిగిలింది. అటు ఢిల్లీ నుంచి రాగానే ఆ ఇద్దరు నేతలు వరుసగా రెండు రోజుల నుంచి ఫామ్ హౌస్ లో ఉన్న కేసీఆర్ తో భేటీ అయ్యారు. ఢిల్లీలో వారు ఎవరిని కలిశారు? ఏం వ్యూహ రచన చేస్తున్నారనేది ఉత్కంఠగా మారింది.

## సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఎలుకల స్వైర విహారం

### 12 మంది విద్యార్థులను కరిచిన ఎలుకలు

రామాయంపేట, జూలై 12 (ప్రజాస్వరం): మెదక్ జిల్లా రామాయంపేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఎలుకల స్వైర విహారం చేస్తున్నాయి. 9 వతరగతికి చెందిన 12 మంది విద్యార్థులను ఎలుకలు కరిచాయి. ఇద్దరు విద్యార్థినిలు అర్ధరాత్రి దాటాక ఉలిక్కిపడి లేచి చూడగానే కాళ్లు, పాదాలకు గాయాలై నెత్తురు కారుతుండటాన్ని చూసుకొని భయాందోళనలకు గురయ్యారు. ఎలుకలతో తాము ఇబ్బందిపడుతున్నామంటూ ఎన్నోసార్లు హాస్టల్స్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆస్పత్రికి చేరుకున్న విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన చేశారు.





## స్విమ్మింగ్‌పూల్‌లో విద్యుదాఘాతం

### 16 మందికి తీవ్రగాయాలు

### ఇద్దరి పరిస్థితి విషమం

హైదరాబాద్, జూలై 12 (ప్రజాస్వరం): ఆహ్లాదంగా గడుపుదామని ఫాంహౌస్ కు వచ్చిన పలువురు ఈతకొలనులో దిగి.. ఆ నీటిలో విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాల పాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ శివారు జల్ పల్లి శివారులో గురువారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. హైదరాబాద్ లోని నాంపల్లి ఆగాపురా ప్రాంతంలో నివాసముండే మూడు కుటుంబాలకు చెందిన 56 మంది ఆహ్లాదంగా గడిపేందుకు జల్ పల్లిలోని ఫాంహౌస్ కు గురువారం ఉదయం వెళ్లారు. సాయంత్రం సమయంలో ఫాంహౌస్ లోని ఈతకొలనులోకి 16 మంది దిగారు. ఈత కొడుతుండగా ఆ నీటిలోకి ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అవడంతో వీరంతా గాయపడ్డారు. కొలను చివరిభాగంలో ఉన్న ఆరుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు, ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. కొలను మధ్యలోనే ఉన్న పర్వేజ్ (19), ఇంతియాజ్ (22) రెండు నిమిషాల పాటు విద్యుదాఘాతానికి గురయ్యారు. తీవ్ర గాయాలయ్యాయి. వీరి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. ఈతకొలను లోపల లైటింగ్ కోసం ఏర్పాటుచేసిన వైరింగ్ తెగిపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈతకొలనులోని దీపాల వైర్ల కనెక్షన్లను లోపలి నుంచి కాకుండా బయటినుంచి ఇచ్చారు. ఈ వైరు కొలనులో తెగిపోవడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతం అయినట్లు పేర్కొన్నారు.


### కొండచరియలు విరిగిపడడంతో నదిలో బోల్తాపడిన బస్సులు

# 60 మంది గల్లంతు

### ప్రమాదం నుంచి బయటపడ్డ ముగ్గురు

### రంగంలోకి దిగిన రెస్క్యూటీంలు.. నదిలో గాలింపు చర్యలు

న్యూఢిల్లీ, జూలై 12 (ప్రజాస్వరం): నేపాల్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కొండచరియలు విరిగిపడడంతో రెండు బస్సులు త్రిశూలి నదిలో పడిపోయాయి. రెండు బస్సుల్లో కలిపి 63 మంది ప్రయాణికులు ఉండగా.. అందులో ముగ్గురు బయటపడగా, మిగతా 60 మంది నీటిలో గల్లంతయ్యారని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఈ ఘోరం చోటుచేసుకుందని తెలిపారు. నదిలో గల్లంతైన ప్రయాణికుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు త్రిశూలి నది ఉప్పొంగి ప్రవహిస్తోందని అధికారులు చెప్పారు. త్రిశూలి నదికి రెండువైపులా కొండలు ఉండగా.. ఓ కొండను ఆనుకుని నారాయణ్ ఘాట్ – మగ్లింగ్ రోడ్ ఉంటుంది. శుక్రవారం తెల్లవారుజామున బస్సులు ఈ రోడ్ పై వెళుతుండగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో బస్సులు అదుపుతప్పి నదిలో పడ్డాయని అధికారులు వివరించారు. ఈ ప్రమాదం గురించిన సమాచారం అందగానే పోలీసులు, సైన్యం



స్పందించాయని, సహాయక చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. బోట్లతో త్రిశూల్ నదిలో గాలిస్తున్నారని వివరించారు. అయితే, వరద ఎక్కువగా ఉండడంతో గాలింపు కష్టంగా మారిందని తెలిపారు. కాగా, కొండచరియల కారణంగా నారాయణ్ ఘాట్ – మగ్లింగ్ రోడ్ ప్రస్తుతం బ్లాక్ అయిందని స్థానిక ఎస్పీ భవేష్ రిమాల్ వివరించారు.

## సీఐఎస్ఎఫ్ అధికారికి చెంపదెబ్బ

### జైపూర్ ఎయిర్ పోర్టులో ఘటన

### స్పైస్ జెట్ సంస్థ ఉద్యోగి అరెస్ట్

న్యూఢిల్లీ, జూలై 12 (ప్రజాస్వరం): జైపూర్ ఎయిర్ పోర్టులో సీఐఎస్ ఎఫ్ అధికారి చెంప ఛెళ్లుమనిపించిన స్పైస్ జెట్ మహిళా ఉద్యోగినిని పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. అనురాధ రాణి అనే మహిళ స్పైస్ జెట్ సంస్థలో ఫుడ్ సూపర్ వైజర్ గా పనిచేస్తున్నారు. ఇతర సిబ్బందితో కలిసి ఆమె ఇటీవల ఉదయం 4 గంటల సమయంలో ఎయిర్ పోర్టులోకి వెళుతుండగా అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ గిరిరాజ్ ప్రసాద్ ఆమెను అడ్డుకున్నారు. ఎయిర్ లైన్స్ సిబ్బంది కోసం ఉద్దేశించిన స్క్రీనింగ్ పోస్టు వద్ద తనిఖీ చేయించుకుని వెళ్లాలని ఆదేశించారు. ఈ క్రమంలో



వారి మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుంది. ఆమె ఒక్కసారిగా ఆయన చెంప ఛెళ్లుమనిపించింది. అయితే, స్పైస్ జెట్ సంస్థ మాత్రం అసభ్య పదజాలం, లైంగిక వేధింపులు ఎదుర్కోవాల్సి రావడంతోనే ఆమె కొట్టిందని ఆరోపించింది.

### ఎమరాల్డ్‌లో పాడైన పన్నీర్, పాలు

హైదరాబాద్, జూలై 12 (ప్రజాస్వరం): హైదరాబాద్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇందిరా పార్క్ సమీపం గల ఎమ్రాల్డ్ స్వీట్స్ లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు జరిగాయి. కిచెన్ కంపు కొడుతూ దుర్గంధ భరితంగా ఉన్నట్లు గుర్తించారు. నిల్వ ఉంచిన పాలు, పెరుగు, పన్నీర్ సీజ్ చేసారు. స్వీట్ల తయారీలో మోతాదుకు మించి ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఎలుకలు, పందికొక్కులు తిరుగుతున్నాయి. దాంతో నిర్వాకులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సీరియస్ అయ్యారు.



## హైదరాబాద్లో అర్ధరాత్రి కాల్పుల కలకలం

### అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని ప్రశ్నించిన పోలీసులు

### గొడ్డలి, రాయితో పోలీసులపై దాడికి యత్నం

### అప్రమత్తమై కాల్పులు జరిపిన పోలీసులు

### నిందితులను యూపీకి చెందిన అనీస్, రాజ్‌గా గుర్తింపు

హైదరాబాద్, జూలై 12 (ప్రజాస్వరం): హైదరాబాద్ లో ఇటీవల వరుసగా కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల నగర శివారులోని రింగురోడ్డుపై పారిపోతున్న పార్థీ ముఠాను పట్టుకునే క్రమంలో పోలీసులు కాల్పులు జరిపారు. తాజాగా అలాంటి ఘటనే హైదరాబాద్ నడిబొడ్డున నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు ప్రశ్నించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి గొడ్డలితో పోలీసులపై దాడికి యత్నించాడు. మరొకతను రాయితో దాడిచేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ఇద్దరికీ గాయాలు కాగా వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితులను ఉత్తరప్రదేశ్ కు చెందిన అనీస్, రాజ్ గా గుర్తించారు. వీరితో పాటు ఈ గ్యాంగులో మరో ఇద్దరు ఉన్నట్టు అనుమానిస్తున్న పోలీసులు కాల్పులతో భయపడి పారిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు.